
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 27.0
కనిష్ఠం 16.0
**
ANDHRAJYOTHY



సూర్యాపేట
5
శుక్రవారం 5 డిసెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	579.20 (280.6992)	16,797	16,797
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.60 (4.36)	252.19	746.53
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.882 (44.0354)	3,500	400

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.240



చేపా.. చేపా ఎదిగేవా?

ఏడాదికేడాది చేపల పెంపకం ప్రశ్నార్థక మవుతోంది. సకాలంలో చెరువుల్లో చేపలు పోయాల్సిన ప్రభుత్వం టెండర్ల నుంచి మొదలు పంపిణీ దాకా ఆలస్యం చేస్తుండటం చేపల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో చేపల్లో అనుకున్న మేర ఎదుగుదల ఉండేనా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నారు. సెప్టెంబరు, అక్టోబరులో రావాల్సిన చేపలు ఈ ఏడాది నవంబరు, డిసెంబరులలో వదులుతుండటంపై మత్స్యకార్మికులు పెదవి విరుస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేటటౌన్)

మత్స్యకార్మికులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే తలంపుతో ప్రభుత్వం చేపల పంపిణీ పథకాన్ని చేపట్టింది. అంతేకాకుండా ప్రస్తుత కాలానికి తగ్గట్టుగా మార్కెటింగ్ సౌకర్యాలను కూడా వారికి కల్పిస్తోంది. 2016-17లో ప్రారంభమైన ఈ పథకం ఒకింత కార్మిక కుటుంబాలకు అండగా నిలిచింది. పథకం ప్రారంభ సమయంలో హడావుడిగా ప్రారంభించడంతో చేప పిల్లలు ఎదుగలేదు. ఒక్కో చేప పిల్ల కేవలం 75 గ్రాముల నుంచి 150 గ్రాములు మాత్రమే ఎదిగాయి.దీంతో మత్స్యకార్మికులు ఆశించినంత మేర ఆర్థికలాభం రాకపోగా నష్టపోయారు. 2017-18 అనంతరం చేపల పంపిణీ సకాలంలో జరిగింది. దీంతో కొన్నిచోట్ల చేపపిల్లలు అరకిలో,కిలో దాకా ఎదిగాయి. 2018-19 నాటికి 2 కోట్లకు పైగా చేప పిల్లలను చెరువులో వదిలారు. ఇవి బాగానే పెరగడంతో మత్స్యకార్మికులు ఆర్థికంగా ఎదిగారు.

- ఆలస్యంగా చేపపిల్లల పంపిణీ
- రెండు మాసాలు ఆలస్యం
- ఎదుగుదలపై తీవ్ర ప్రభావం

సకాలంలో అందితేనే...

జిల్లాలో 661 చెరువులు, కుంటలు ఉండగా 165 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 15,540మంది సభ్యులుగా ఉన్నారు. 100శాతం సబ్సిడీపై చేప పిల్లలను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. అంతేకాక చేపల వ్యాపారం చేసుకోవడానికి ప్రభుత్వం అనేక పథకాలను కూడా అమలుచేస్తోంది. అయితే ప్రతీ ఏడాది అక్టోబరులో చేపపిల్లలను చెరువుల్లో వదలాల్సి ఉంటుంది. అవి ఎదిగిన అనంతరం ఏప్రిల్, మే మాసాల్లో పట్టుకుని మత్స్య కార్మికులు విక్రయిస్తుంటారు. అయితే సకాలంలో వదలకపోవడంతో మత్స్యకార్మికులు నష్టపోతున్నారు. జిల్లాలో 3.31 కోట్ల చేపపిల్లలను ఈ ఏడాది వదిలారు. అయితే ప్రధానంగా చెరువులు నిండిన సెప్టెంబరు, అక్టోబరులలో చేపపిల్లలను వదిలిపెడితే అవి ఏప్రిల్ నాటికి కనీసం రెండు కిలోల నుంచి మూడు కిలోల దాకా పెరిగేవి. కానీ నవంబరు చివరివారంలో, డిసెంబరులో వదిలిపెట్టడం వల్ల మత్స్య కార్మికులకు ఆశించిన ప్రయోజనాలు కలిగే పరిస్థితి కనిపించడం లేదు.

ఎదుగుదలపై ప్రభావం ఉంటుంది



ఈ ఏడాది చేపపిల్లల పంపిణీ రెండు నెలలకు పైగా ఆలస్యమైంది. ఈంతో చేపపిల్లల ఎదుగుదల తక్కువగా ఉండనుంది. అధికారులు చేపపిల్లల నాణ్యతను పాటించలేదు కనీసం పంపిణీ సమయంలో కుల సంఘాలను పిలవలేదు. దీనిమూలంగా చేపపిల్లల నాణ్యత తెలువకుండాపోయింది.

- యాదగిరి, ముదిరాజ్ మహసభ అధ్యక్షుడు

టెండరు ప్రక్రియలో ఆలస్యం

మత్స్య కార్మికులు ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వమే సొసైటీలకు సంబంధించి న చెరువులు, పంచాయతీ చెరువులకు చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది చేపపిల్లల పంపిణీకి టెండర్లను ఆలస్యంగా ఆహ్వానించింది. ముఖ్యంగా మే పూర్తి చేయాల్సిన టెండర్లను ఆగస్టులో పిలిచారు. స్థానిక కాంట్రాక్టర్‌లు, ఇతర రాష్ట్రానికి చెందిన ఒక కాంట్రాక్టర్ చేపపిల్లల పంపిణీకి ముందుకు వచ్చారు. మూడు రకాల సైజుల్లో బొచ్చ, రవ్వ, బంగారుతీగ, రోహింగా రకాల చేపలను వదలాల్సి ఉంది. అయితే కాంట్రాక్టర్లకు పెద్దసైజు వాటికి రూ.1.50, చిన్నవాటికి 50 పైసలు చెల్లిస్తారు. గత ప్రభుత్వం చేపపిల్లలను ఉచితంగా...

- మిగతా 8వ పేజీలో...

మొదటి విడతలో ... ప్రచారం షురూ

- ఏడుగురు సర్పంచ్‌లు, 198 వార్డులు ఏకగ్రీవం
- రెండో విడతలో నామినేషన్ల పరిశీలన పూర్తి
- మూడో విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ



పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడతలో ప్రచారం మొదలైంది. బుధవారం సాయంత్రమే గుర్తులు ఖరారు కావడంతో అభ్యర్థులు ప్రచారం బాట పట్టారు. 159 సర్పంచ్ స్థానాలకు 473 మంది, 1,441 వార్డు స్థానాలకు 2,911 మంది బరిలో నిలిచారు. ఈ నెల 11వ తేదీన పోలింగ్ ఉన్న నేపథ్యంలో ఆరు రోజులే ప్రచారానికి అవకాశం ఉంది. దీంతో ఇంటింటికీ కనీసం రెండు సార్లయినా వెళ్లి ఓట్లు అభ్యర్థించాలనే లక్ష్యంతో ప్రచారాన్ని మొదలుపెట్టారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)

జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మొదటి విడతలో ఎనిమిది మండలాల్లో అభ్యర్థులు, గుర్తులు ఖరారయ్యారు. 159 సర్పంచ్ స్థానాలకు 1,132 మంది, 1441 వార్డులకు 3,646 మంది నామినేషన్లు దాఖలు చేయగా 659 మంది ఉపసంహరించుకోగా 473 మంది పోటీలో మిగిలారు. అదేవిధంగా 1,441 వార్డులకు 3,646 నామినేషన్లు దాఖలు చేయగా 198 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. నూతన్‌కల్ మండలం పెదనెమిల ఒకటో వార్డుకు ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు.

ఆత్మకూరు(ఎస్) మండలంలో రెండు వార్డులకు నామినేషన్లను తిరస్కరించారు. దీంతో 1,241 వార్డులకు మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తుండగా 668మంది ఉపసంహరించుకోగా 2,911 మంది బరిలో ఉన్నారు. మొదటి విడతలో ఏడుగురు సర్పంచ్‌తో పాటు 198 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. మిగిలిన చోట్ల రేపటి నుంచి మరింతగా ప్రచారం హోరెత్తనుంది. వార్డుకు ముగ్గురు, నలుగురు చొప్పున బరిలో నిలుచుండటంతో ప్రతీ గల్లీలో అభ్యర్థుల సందడి నెలకొననుంది.

రెండో విడతలో నామినేషన్ల పరిశీలన

జిల్లాలో రెండో విడతకు దాఖలైన నామినేషన్ల పరిశీలన బుధవారం పూర్తయ్యింది...

- మిగతా 8వ పేజీలో...

మంచులో ప్రయాణం ప్రమాదకరం: ఎస్పీ



సూర్యాపేట క్రైం, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): మంచులో ప్రయాణం చేయడం ప్రమాదకరమని ఎస్పీ కొత్తపల్లి నరసింహ అన్నారు. గురువారం సూర్యాపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చలికాలం అయినందున ఉదయం, రాత్రి సమయాల్లో పొగమంచు విపరీతంగా వస్తోందని అన్నారు. వాహనాలను నడిపేవారు మంచు కురిసే సమయంలో చాలా జాగ్రత్తగా నడపాలన్నారు. మంచుతో ముందు వెళ్తున్న వాహనాలు, రోడ్డు పక్కన ఆగి ఉన్న వాహనాలు, రోడ్డు దాటే వ్యక్తులు, పశువులు కనిపించక రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మంచు కురిసే సమయాల్లో వాహనాలు లైట్లు వేసుకుని వేగం తగ్గించి ప్రయాణం చేయాలని, ఇండికేటర్లు వేసి వాహనాలను నడపాలన్నారు. వాహనాల మధ్యలో దూరం పాటించాలని సూచించారు. మంచు తీవ్రతతో జిల్లాలో ఐదేళ్లలో 77 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, ఈ ప్రమాదాల్లో 34 మంది మృతి చెందారని, 94 మంది క్షతగాత్రులయ్యారని తెలిపారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. వాహనాలను నడిపే సమయంలో సడన్ బ్రేక్‌లు వేయవద్దన్నారు. పొగమంచు సమయాల్లో ప్రయాణాలు చేయకుండా తర్వాత ప్రయాణాలు చేసే విధంగా మార్చుకోవాలన్నారు.


కొనుగోలు కేంద్రాల్లో కాంటాల వేగం పెంచాలి



మోతె మండలం సర్వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న డీసీవో ప్రవీణ్

మోతె, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో కాంటాల వేగం పెంచాలని డీసీవో ప్రవీణ్ అన్నారు. గురువారం మండలంలోవని సర్వారంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సొసైటీల ద్వారా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురిచేసినా, తూకంలో అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం తూకం వేయాలన్నారు. తూకంలో తేడాలు ఉంటే రైతులు ఫిర్యాదులు చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ప్రాథమిక సొసైటీలద్వారా వానాకాలం సీజన్‌లో 77,294.20 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 11873 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. దీనికి జిల్లా వ్యాప్తంగా 56,414.40 మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ.134.12 కోట్లను 8645 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. జిల్లాలో ఏ కేంద్రాల్లోనైనా ఏవిధమైన అక్రమం జరిగినా చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం విక్రయించడానికి వచ్చిన రైతులను సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తే పై అధికారులకు తెలియజేయాలన్నారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నిర్వాహకులు కాంటాలు వేయడంలో, ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించడంలో వేగం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది. రైతులు పాల్గొన్నారు.

శ్రీఅనంతపద్మనాభస్వామికి ప్రత్యేక పూజలు



బూరుగడ్డలో గ్రామంలో అనంతపద్మనాభస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

హుజూర్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోర్ల పౌర్ణమి సందర్భంగా గురువారం మండలంలోని బూరుగడ్డ వేణుగోపాలస్వామి దేవాలయంలో శ్రీఅనంతపద్మనాభస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మణ్‌రావు, హరీష్‌కుమారాచార్యులు, యరగాని కిరణ్, వెంకటశ్రీనివాసరావు, శశి, వంశీకృష్ణ, సత్యజ్యోతి, సమీర, ఆదిత్యమోహన్, రమేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో నిబంధనలు తప్పక పాటించాలి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి ఎన్నికల సాధారణ పరిశీలకుడు కలెక్టర్ తేజ్‌స నందలాల్ పవార్, ఎస్పీ కొత్తపల్లి నరసింహ, ఇతర అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జిల్లాలో పలు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయినప్పటికీ, ఎన్నికలు ముగిసే వరకు ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన, ఉపసర్పంచ్ ఎన్నిక, పోస్టల్ బ్యాలెట్‌తో పాటు ఎన్నికలకు సంబంధించిన అన్ని అంశాలపై ఎన్నికల అధికారులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఫారం-10 ప్రకారం ఎన్నికల ఫలితాలను ప్రకటించాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల సాధారణ పరిశీలకుడు గుగులోత్ రవి నాయక్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ పత్రాల జారీని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. దీని కోసం ఎంపీడీవో కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పించాలన్నారు. ప్రతి రోజు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత డ్రాప్ బాక్సులను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల వారీగా ఇప్పటికే ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పత్రాలను ఎంపీడీవో కార్యాలయాలకు పంపామన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే పీవోలకు మొదటి విడత శిక్షణ పూర్తయిందని, రెండో విడత శిక్షణ త్వరలో నిర్వహిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ కోసం ప్రతి మండలానికి ఒక నోడల్ అధికారిని నియమించామన్నారు.



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాణి కుముదిని, పాల్గొన్న జిల్లా అధికారులు

ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి, సర్వీస్ ఓటర్ల కోసం వారి సొంత మండల ఎంపీడీవో కార్యాలయంలో ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. మొదటి విడత ఎన్నికలు జరిగే 8 మండలాల్లో ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. రెండో విడత ఎన్నికలు జరిగే మండలాల్లో ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు, మూడో విడత ఎన్నికలు జరిగే మండలాల్లో ఈనెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల సిబ్బందిని, సామగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు జోనల్ అధికారులు, రూట్ అధికారులను నియమించి రూట్ మ్యాప్ సిద్ధం చేశామన్నారు. ఎన్నికల ఫలితాలు జరిగే సమయంలో వెబ్ క్యాస్టింగ్ చేస్తామని, మైక్రో అబ్జర్వర్స్‌కు ఈ నెల 6వ తేదీన శిక్షణ ఇస్తామన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు పూర్తి కాగానే ఉప సర్పంచ్ ఎన్నిక జరపాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, జడ్పీ సీఈవో అప్పారావు, డీపీవో యాదగిరి, డీఎల్‌పీవో నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్లను జాగ్రత్తగా జారీ చేయాలి

అర్వపల్లి: పోస్టల్ బ్యాలెట్లను రిటర్నింగ్ అధికారులు జాగ్రత్తగా జారీ చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం అర్వపల్లి మండల పరిషత్ కార్యాలయంలో స్టేజ్-1, 2 రిటర్నింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రెండవ సాధారణ గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులకు సంబంధించిన నియమ నిబంధనలను పాటించాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించామన్నారు.ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో ఝాన్సీ, ఎంపీవో గోపి, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

'బెల్ట్' బిగుస్తోంది

- మద్యం బెల్ట్‌దుకాణాలపై పోలీస్, ఎక్సైజ్ శాఖల నజర్
- నేటికి 100కు పైగా కేసులు నమోదు



మామిళ్లగూడెం చెక్‌పోస్టు వద్ద నాటుసారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం పౌడర్‌ను పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు(ఫైల్)

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటక్రైం): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మద్యం బెల్ట్‌దుకాణాలపై పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు దృష్టి సారించారు. ఎన్నికలు ముగిసే వరకూ మద్యం విక్రయాలు చేపట్టకుండా చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ కొంతమంది మద్యం విక్రయిస్తుండటంతో వారిపై తీవ్రచర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ప్రతీ గ్రామంలో 5 నుంచి 10 దాకా బెల్ట్ దుకాణాలు ఉన్నాయి. ప్రతీ క్వార్టర్‌కు రూ.10 నుంచి రూ.20 దాకా పెంచి విక్రయిస్తున్నారు. మద్యం సులువుగా లభ్యమై ఘర్షణలకు జరిగే అవకాశం ఉండటంతో పల్లెల్లో మద్యం విక్రయాల నియంత్రణకు పోలీస్, ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టారు. రెండేళ్ల ఆలస్యంగా పంచాయతీ ఎన్నికలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఇప్పటికే 170 సమస్యాత్మక గ్రామాలు ఉన్నట్లు పోలీస్ అధికారులు గుర్తించారు. మొదటివిడతలో ప్రచారం ముమ్మరం కానుంది. దీంతో ఎన్నికల వాతావరణం వేడెక్కనుంది. అభ్యర్థుల తాయిలాలతో బెల్ట్ దుకాణాలకు గిరాకీ పెరగనుంది.

జిల్లాలో నమోదైన కేసులు

జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత నుంచి ఎక్సైజ్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. గ్రామాల్లో బెల్ట్ దుకాణాలను సీజ్ చేశారు. ఇప్పటివరకు రూ.15.32 లక్షల విలువైన మద్యం, నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం, పటికను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల జిల్లా ఎక్సైజ్ అధికారులు 10 కిలోల పటిక, 35.85 కిలోల నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం, 1,460 లీటర్ల మద్యం సీజ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 56 కేసులు నమోదు చేసి 28మందిని అరెస్ట్ చేశారు. అదేవిధంగా జిల్లాలో 13 బెల్ట్ దుకాణాలను మూసివేయించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 50 కేసులు నమోదుచేశారు. రూ.5 లక్షల విలువైన 600 లీటర్ల మద్యం, 50 లీటర్ల బెల్లం పానకా న్నిస్వాధీనం చేసుకున్నారు. ప్రతి రోజూ జిల్లాలో పోలీసు అధికారులు మద్యం అక్రమ విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేస్తున్నారు.

ప్రోత్సహిస్తున్న వైన్స్ యజమానులు

జిల్లాలో కొన్నిచోట్ల వైన్స్ యజమానులే బెల్ట్ దుకాణాలను ప్రోత్సహిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. బినామీలతో ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాల్లో బీరుకు రూ.30 అదనంగా తీసుకుని విక్రయిస్తున్నారు. ఎన్నికల వేళ బెల్ట్ దుకాణాల నిర్వహణ వల్ల ఘర్షణలు ఎక్కువయ్యే అవకాశం ఉంది. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మద్యం దొరకని గ్రామాల్లేవు. కొన్నిచోట్ల గుడి, బడి సమీపంలో బెల్ట్‌దుకాణాలు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలో 486 పంచాయతీలుగా సుమారు 3వేల వరకు బెల్ట్ దుకాణాలు ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా గుడుంబా తయారీని అరికట్టడంలో సఫలమైన అధికారులు బెల్ట్ దుకాణాలను అరికట్టడంలో శ్రద్ధ చూపడంలేదు. అడపాదడపా దాడులు చేయడం మినహా సరైన చర్యలు తీసుకోవడం లేదు.

పరిమితికి మించి మద్యం ఉంటే చర్యలు

నిబంధనలకు మించి మద్యం నిల్వ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకొంటాం. ఎవరైనా 12 ఫుల్‌బాటిళ్ల, 12 బీర్లను నిల్వ చేసుకోవచ్చు. అంతకు మించి రవాణా చేసినా కేసులు నమోదు చేస్తాం. గ్రామాలు, పట్టణాల్లో మద్యం బెల్ట్ దుకాణాలను బంద్ చేయిస్తున్నాం. నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం. నాటుసారా తయారీ, విక్రయాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

లక్ష్మానాయక్, ఈఎస్, సూర్యాపేట

ధనుర్మాస ప్రవచనాలకు లక్ష్మణాచార్యులు ఎంపిక

కోదాడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా కోదాడ పట్టణంలోని గుంటి రఘునాథస్వామి దేవాలయంలో ఈ నెల 16వ తేదీ నుంచి జనవరి 14వ తేదీ వరకు తిరుప్పావై ప్రవచనాలు చెప్పడానికి పట్టణానికి చెందిన ముడుంబై లక్ష్మణాచార్యులను తిరుమల తిరుపతి దేవస్థానం నియమించింది. ఈ సందర్భంగా గురువారం కోదాడలో లక్ష్మణాచా ర్యులు మాట్లాడుతూ టీటీడీ ఆల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రవచనాల కార్యక్రమం ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటలకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోదాడ పట్టణంతో పాటు నియోజకవర్గ భక్తులు పాల్గొనాలని కోరారు.

పుడమికి పుట్టెడు శోకం

- మనిషి ఉనికి, జీవనానికి మూలాధారం మట్టి
- నేడు ప్రపంచ మృత్తిక దినోత్సవం

7



సంగ్రామం

మూడు దశాబ్దాలు కాంచనపల్లి కుటుంబ సభ్యులే..

- సర్వారం సర్పంచ్‌లుగా తొలుత తనయుడు, ఆపై తల్లి
- 15 ఏళ్ల చొప్పున ఇద్దరి పాలన

6

ఓటు వేయాలంటే మూడు కిలోమీటర్లు నడక..

6

పల్లెపోరు.. కళతప్పిన పట్టణ వ్యాపారం

- పట్టణాలకు తగ్గిన గ్రామస్థుల రాక
- గిరాకీలు తగ్గి వ్యాపారాలు డీలా
- పట్టణాల్లో వ్యాపారంపై ఎన్నికల ప్రభావం

7

అత్తా కోడళ్ల పోటీ

6

ఓటు వేయాలంటే మూడు కిలోమీటర్లు నడక...

(ఆంధ్రజ్యోతి-మర్రిగూడ): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో పంచాయతీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటర్లు మూడు కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. ఈ నెల 11న జరిగే పోలింగ్ రోజు ఆవాస గ్రామాల ప్రజలకు ఓటు వేయటానికి తిప్పలు తప్పడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. మర్రిగూడ మండలంలోని వట్టిపల్లి, సరంపేట, రాంరెడ్డిపల్లి, మర్రిగూడ, కొండూరు, అజిలాపురం, కమ్మగూడెం, గ్రామాల పరిధిలో ఉన్న ఆవాస గ్రామాలైన బట్లపల్లి, చర్లగూడెం, సరంపేట తండా, తానేదారిపల్లి, జంటతండా, బోటిమీదతండా, బుజ్జితండా, భీమ్లాతండా, నర్సింపురం గ్రామాల ప్రజలకు రోడ్డు, బస్సుసౌకర్యం లేవు. దీంతో పంచాయతీ లున్న చోటే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఆవాస గ్రామాల ఓటర్లు అక్కడికి వెళ్లి ఓట్లు వేయాల్సి వస్తోంది. సుమారు రెండున్నర కిలోమీటర్ల నుంచి మూడు కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇదిలా ఉండగా వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి వర్ణనాతీతం. అధికారులు ఆవాసాల గ్రామాల్లోనే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసి ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వలస ఓటర్లపై నజర్...

(ఆంధ్రజ్యోతి-రాజాపేట): వివిధ పార్టీల మద్దతుతో రంగంలో నిలిచిన సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు నాయకులు ఓట్ల కోసం నానా తంటాలు పడుతున్నారు. గ్రామాల్లో ఓటుహక్కు ఉండి బతుకుదెరువు కోసం పట్టణాలకు వలసలు వెళ్లిన ఓటర్లపై ప్రత్యేక దృష్టిని సారించారు. పట్టణాల్లో ఏ గల్లీలో ఉన్నా ఆ గల్లీకి వెళ్లి ఓటర్లను కలుసుకుని తమకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. రానుపోను రవాణా సౌకర్యాలను కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నర్సాపురంలో అత్తా కోడళ్ల పోరు



ఎమ్మ శిరీష ఎమ్మ అయిలమ్మ

(ఆంధ్రజ్యోతి-రాజాపేట): యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని నర్సాపూర్ గ్రామంలో ద్విముఖ పోటీ జరుగుతోంది. అది కూడా అత్తాకోడళ్ల మధ్యే. వారిద్దరూ పోటీపడుతోందీ సర్పంచ్ పదవి కోసమే. గ్రామంలో 839 ఓటర్లుండగా సర్పంచ్ స్థానం జనరల్ మహిళకు రిజర్వు చేశారు. కాగా ముగ్గురు నామినేషన్ దాఖలు చేయగా బుధవారం ఒకరు ఉపసంహరించుకున్నారు. ఎమ్మ అయిలమ్మ, ఎమ్మ శిరీషలు రంగంలో ఉన్నారు. వీరిద్దరూ వరుసకు(అన్నదమ్ముల పిల్లల వరుస) అత్తా కోడళ్లు. ఇద్దరవి పక్కపక్క ఇళ్లు. అయిలమ్మ అత్త కాగా, శిరీష కోడలు. అయిలమ్మ బీఆర్ఎస్ మద్దతుతో, శిరీషతో కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేస్తున్నారు. దీంతో పోటీ రసవత్తరంగా మారింది.

మూడు దశాబ్దాలు కాంచనపల్లి కుటుంబ సభ్యులే...

» సర్వారం సర్పంచ్‌లుగా తొలుత తనయుడు, ఆపై తల్లి » 15 ఏళ్ల చొప్పున ఇద్దరి పాలన



సర్వారం గ్రామపంచాయతీ మలి సర్పంచ్ కాంచనపల్లి తాయమ్మరాంచందర్‌రావు, కాంచనపల్లి అమృతరావు (ఇన్‌సెట్‌లో)

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ) : నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం సర్వారం గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించిన కుటుంబం గ్రామపాలనలోనూ తమదైన ముద్రవేసింది. రజాకార్ల చెర వీడి హైదరాబాద్ రాష్ట్రంగా ఆవిర్భవించిన తొలినాళ్లలో 1952లో గ్రామపంచాయతీలకు జరిగిన మొదటి ఎన్నికల్లో కాంచనపల్లి అమృతరావు సర్పంచ్‌గా ఎన్నికై 15 ఏళ్లు పాలించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ఆయన తల్లి కాంచనపల్లి తాయమ్మరాంచందర్ ఎన్నికై 15ఏళ్లు ఆ గ్రామాన్ని పరిపాలించారు. మూడు దశాబ్దాల పాటు ఏకధాటిగా కాంచనపల్లి కుటుంబం గ్రామాన్ని పాలించింది. నైజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరులో కాంచనపల్లి కుటుంబసభ్యులు ముఖ్యభూమిక పోషించిన నేపథ్యంలో ఆ తరం గ్రామస్థులు గ్రామాభివృద్ధి బాధ్యతలు సైతం వారికి అప్పగించి, నీరాజనాలు పలికారు. వారి ఆకాంక్షలకు తగ్గట్టుగా పాలన సాగించి ఇప్పటితరానికి సైతం కాంచనపల్లి కుటుంబ సభ్యులు మార్గదర్శకంగా నిలిచారు.

రహదారి కోసం సొంత పొలం

పంచాయతీగా తొలినాళ్లలో తిప్పర్తి నుంచి సర్వారం గ్రామానికి కేవలం డొంక దారి మాత్రమే ఉండేది. వర్షాకాలంలో అది కుడా అంతంత మాత్రంగానే ఉండేది. అటువంటి దుస్థితిలో కాంచనపల్లి కుటుంబం సొంత పొలం నుంచి రహదారి నిర్మించి తిప్పర్తి-సర్వారం మధ్య రాకపోకలను విస్తరించయారు. అది గ్రామాభివృద్ధికి ఒక మైలురాయి. అదేవిధంగా ప్రాథమిక పాఠశాల నిర్మించి గ్రామస్థులకు అక్షర జ్యోతి వెలిగించారు. ఇప్పటికీ వారు కట్టించిన పాఠశాలలోనే పాఠశాల కొనసాగుతోంది. నిరుపేద దళితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో పొలిమేరల్లోని సొంతభూమిని ధారాదత్తం చేసింది. అదేవిధంగా గ్రామదేవతల కోసం గ్రామ నడిబొడ్డున అప్పుడు స్థలం కేటాయించగా, ఆ స్థలంలనే ఆ కుటుంబం గుడిని నిర్మించింది. గతంలో కాంచనపల్లి కుటుంబ సభ్యులు ఇచ్చిన స్థలంలోనే బీఆర్ఎస్ హయాంలో పంచాయతీ భవనాన్ని నిర్మించారు. గ్రామాభివృద్ధిలో ఇప్పటికీ ఆ కుటుంబం చెరగని ముద్ర వేసుకుంది.

బీఎన్‌తిమ్మాపూర్‌లో సర్పంచ్ దంపతులు...

ప్రస్తుతం సర్పంచ్ బరిలో కుమారుడు



ఎడ్ల సత్తిరెడ్డి, సుశీల

(ఆంధ్రజ్యోతి-భువనగిరి రూరల్): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని బీయన్‌తిమ్మాపూర్‌కు చెందిన భార్యాభర్తలు ఇద్దరూ సర్పంచ్‌లుగా పనిచేయగా, వారి కుమారుడు ప్రస్తుతం ఎన్నికల బరిలో నిలిచారు. ఎడ్ల సత్తిరెడ్డి, ఎడ్ల సుశీల దంపతులు ఒక్కో పర్యాయం సర్పంచ్‌లుగా పనిచేశారు. 1987లో బీఎన్‌తిమ్మాపూర్ గ్రామపంచాయతీ జనరల్ స్థానానికి కేటాయించగా సర్పంచ్‌గా ఎడ్ల సత్తిరెడ్డి ఎన్నికై 1992వరకు బాధ్యతలు నిర్వహించారు. అయితే 2014లో సర్పంచ్ స్థానం జనరల్ మహిళకు రిజర్వు కావడంతో సత్తిరెడ్డి భార్య సుశీల సర్పంచ్‌గా ఎన్నికై 2019వరకు కొనసాగారు. ప్రస్తుతం మరోమారు సర్పంచ్ స్థానం జనరల్‌కు కేటాయించగా వారి కుమారుడు ఎడ్ల వెంకట్‌రెడ్డి సర్పంచ్ బరిలో నిలిచారు.

సంగ్రామం

మోతె కాంగ్రెస్‌లో వర్గపోరు

(ఆంధ్రజ్యోతి-మోతె): సూర్యాపేట జిల్లా మోతె మండలంలో కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు మొదలైంది. ఒకరు మరొకరిపై పైచేయి సాధించేందుకు ఇరువర్గాలు పదుల సంఖ్యలో నామినేషన్లు వేయించారు. మండలంలోని 29 గ్రామాల్లోనూ కొంతకాలంగా వర్గపోరు నడుస్తోంది. మోతె, రావిపహడ్, రాయికుంటతండా, కూడలి గ్రామాల్లో గ్రామశాఖ అధ్యక్షులు సైతం ఇద్దరుగా చెలామణి అవుతున్నారు. కూడలి, సిరికొండ, అన్నారిగూడెం, సర్వారంతో పాటు మరికొన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు పెద్దసంఖ్యలో నామినేషన్లు దాఖలు వేశారు. సిరికొండలో 14 మంది సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు చేయడం వర్గపోరు ఏస్థాయిలో ఉందో సూచిస్తోంది. పలుచోట్ల ఏకగ్రీవమయ్యే చోట్ల వర్గపోరు అడ్డంకిగా మారింది. మాకేంటీ అన్నట్లు నాయకుల తీరు ఉందని పలువురు వాపోతున్నారు. దీంతో సామాన్య కార్యకర్తలు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. వర్గపోరుతో నామినేషన్లు వేసిన వారు సైతం ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక్కరినే బరిలో నిలిపేందుకు ఇటీవల రెండు దఫాలుగా కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రయత్నించారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్‌లో భిన్నపరిస్థితులు ఉన్నాయి. ఎన్నికల సందర్భంగా వేసిన కమిటీలు సూచించిన వారు నామినేషన్ దాఖలు చేసి ప్రచారం మొదలుపెట్టారు. అయితే మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు రెబల్‌గా పోటీ చేస్తున్నారు.

పల్లెపల్లెకూ సొంత మేనిఫెస్టోలు



రాజాపేట మండలం మల్లగూడెం గ్రామ పంచాయితి

(ఆంధ్రజ్యోతి-రాజాపేట): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటివిడతలో అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు పూర్తి కావడంతో ప్రచారం ఊపందుకుంది. ఎవరికి వారు సోషల్‌మీడియాలను వినియోగించుకుని ఓటర్లకు దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఒకరికి మించి ఒకరు అలవికాని హామీలను ఇస్తున్నారు. ఎవరికి వారు సొంత మేనిఫెస్టోలను తయారు చేసుకుని, వాటిని అమలు చేస్తామంటూ ఊదరగొడుతున్నారు. అక్కడక్కడ చర్చలు నిర్వహిస్తున్నారు. అడ్డూఅదుపు లేకుండా ఒకరిపై ఒకరు విమర్శ, ప్రతి విమర్శలకు దిగుతున్నారు. ఇలా ప్రతీ గ్రామానికో, ప్రతీ అభ్యర్థికో మేనిఫెస్టో తయారు చేసుకుని ఓటర్లకు వివరిస్తున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలో 23 గ్రామపంచాయతీలు ఉండగా మల్లగూడెం, పుట్టగూడెం పంచాయతీలు ఏకగ్రీమవయ్యాయి. మిగిలిన 21 చోట్ల 63 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. మెజార్టీ గ్రామాల్లో ద్విముఖ పోటీ నెలకొనగా, కొన్నిచోట్ల త్రిముఖ, చతుర్ముఖ పోటీ నెలకొంది. నామినేషన్లు వేసినప్పటి నుంచే అభ్యర్థులు ప్రచారాన్ని ప్రారంభించారు. కులాల వారీగా తమ కులం అభ్యర్థికి ఓటు వేయాలని కట్టడి చేస్తున్నారు. ఎలాగైనా తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు పావులను కదుపుతున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



పంతంగి టోల్‌గేటు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

(ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ రూరల్/కేతేపల్లి) గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి, నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ సమీపంలోని టోల్‌గేట్స్ వద్ద పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. గురువారం సాయంత్రం ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంటు పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కో వాహనాన్ని నిశితంగా పరిశీలించి, పంపిస్తున్నారు. తనిఖీల్లో నల్లగొండ జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ విజయ్, ఎక్సైజ్ ఎస్ఐలు హారిక, చాంద్‌బీ, చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ పాల్గొన్నారు.

రెండోసారి ఏకగ్రీవాలే...

ఆదర్శంగా నిలుస్తున్న పుట్టగూడెం, మల్లగూడెం

(ఆంధ్రజ్యోతి-రాజాపేట): గ్రామాభివృద్ధి కోసం పలు పల్లెలు ఏకగ్రీవాల బాటపడుతున్నాయి. ఎన్ని పార్టీలున్నా, తాము ఏ పార్టీలో తిరుగుతున్నా చివరకు ఊరి అభివృద్ధే లక్ష్యంగా ఏకగ్రీవంతో తమ ఐక్యతను చాటుకుంటున్నారు. ఇలా యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలో రెండో పర్యాయం కూడా సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుని పుట్టగూడెం, మల్లగూడెం గ్రామాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. పుట్టగూడెం గిరిజన గ్రామంలో 759 ఓటర్లు ఉండగా సర్పంచ్‌తో పాటు ఎనిమిది వార్డు స్థానాలు ఉన్నాయి. గతంలో కొండ్రెడ్డిచెరువు, పుట్టగూడెం గ్రామాలు కలిపి పుట్టగూడెం పంచాయతీగా ఉండేవి. గత బీఆర్ఎస్ హయాంలో కొండ్రెడిచెరువును ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటుచేశారు. అయితే గత పంచాయతీ ఎన్నికల్లోనూ పాలకవర్గాన్ని గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏ పార్టీలో తిరిగినప్పటికీ గ్రామాభివృద్ధి కోసమే అంతా ఒక్కటై ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అదేవిధంగా మల్లగూడెం పంచాయతీ తీరు అంతే. పాముకుంట పంచాయతీ నుంచి మల్లగూడెం ప్రత్యేక పంచాయతీ ఏర్పడింది. గత ఎన్నికల్లో గ్రామస్థులు తొలిసారి సర్పంచ్‌గా రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుత ఎన్నికలలో కూడా పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు గ్రామాల ప్రజల ఐక్యతను మండల ప్రజలు అభినందిస్తున్నారు.

మహారాష్ట్ర, ఏపీ నుంచి ధాన్యం తరలింపు

● 11మందిపై కేసు నమోదు



ఆలగడప వద్ద పట్టుకున్న ధాన్యం లోడ్ లారీలు, వివరాలు వెల్లడిస్తున్న మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సరైన పత్రాలు లేకుండా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను దాటుకుంటూ నల్లగొండ జిల్లాకు అక్రమంగా ధాన్యం రవాణా చేస్తున్న 11మందిపై కేసు నమోదు చేసినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర గొండుపిప్రికి చెందిన ఐదు ధాన్యం లారీలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరువూరు, నందిగామ తదితర ప్రాంతాలకు చెందిన ఆరు లారీలు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను దాటుకుంటూ మిర్యాలగూడ వైపు వస్తుండగా బుధవారం ఆలగడప టోల్‌గేట్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. మొత్తం 11లారీల్లో 3,122 క్వింటాళ్ల ధాన్యాన్ని నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. లారీలను మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇచ్చినట్లు చూపుతున్న పత్రాలు సక్రమంగా లేవని, ధాన్యానికి సంబంధించిన పత్రాలు సక్రమంగా లేనందున వారిపై కేసులు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ధాన్యాన్ని ఎవరు తెస్తున్నారు? ఎక్కడికి చేరవేస్తున్నారు? మార్గమధ్యలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఎలా దాటుకుని వచ్చారో పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఇదే తరహాలో వచ్చిన 71 ధాన్యం లారీలను వాడపల్లి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పట్టుకుని వెనక్కి పంపామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం తరలించి కేసుల పాలుకావద్దని డీఎస్పీ తెలిపారు. 11మంది లారీ డ్రైవర్లపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్ఐ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ధరావత్ సొమ్ముకు రూ.1000 నాణేలు

● చందాలు వసూలుచేసిన యూత్ సభ్యులు ● సర్వారం సర్పంచ్ అభ్యర్థిగా మహిళ నామినేషన్



సర్వారం సర్పంచ్ అభ్యర్థిగా రూపాయి నాణేలతో నామినేషన్ వేస్తున్న బుడిగె పుల్లమ్మ

గరిడేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి కోసం సర్వారం యూత్ క్లబ్ సభ్యులు వినూత్నంగా ఆలోచించారు. కూలీగా జీవనం సాగించే మహిళతో నామినేషన్ వేయించారు. ధరావత్ సొమ్ము కోసం గ్రామంలో రెండు రోజుల పాటు రూపాయి నాణేలు చందాలుగా వసూలుచేశారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం సర్వారంలో ఈ సంఘటన జరిగింది. సర్వారం గ్రామ సర్పంచ్ పదవి బీసీ మహిళకు రిజర్వేషన్ అయింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బుడిగె పుల్లమ్మ నామినేషన్ వేసేందుకు వచ్చి, ధరావత్ సొమ్ముగా రూ.1000 రూపాయి నాణేలు అందజేసింది. ఈ విషయమై బుడిగె పుల్మమ్మను పలకరించగా, తాము కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, గ్రామాభివృద్ధి కోసం యూత్ క్లబ్ సభ్యులు స్వచ్ఛందంగా చందాలు వేసుకుని తనను ఎన్నికల బరిలో నిలిపినట్లు తెలిపారు. డబ్బు పంచడం, మందు సీసాలు ఇవ్వడం వంటి ప్రలోభాలు లేకుండా, గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తాననే నినాదంలో ఎన్నికలో పోటీకి నిలబెట్టినట్లు తెలిపింది. గ్రామ యూత్ సభ్యులు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో డబ్బు ఆశ చూపి, ఇతరత్రా ప్రలోభ పెట్టిన అభ్యర్థులు గెలిచిన అభ్యర్థులు గ్రామాభివృద్ధిని పట్టించుకోవడంలేదని, ఇలాంటి దుస్థితికి ముగింపు పలకాలని ఎవరితోనూ వివాదం లేని పుల్లమ్మను బరిలో దింపినట్లు తెలిపారు.

పింఛన్ ఇప్పించండి సారూ..



హెల్ప్‌డెస్క్ అధికారిని పింఛన్ కోసం వేడుకుంటున్న సుశీల

చౌటుప్పల్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈమె పేరు రవ్వ సుశీల. సామాజిక పింఛన్ కోసం యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం క్లస్టర్ నామినేషన్ కేంద్రానికి కనిపించిన ప్రతీ నాయకులను, అధికారులను ప్రాధేయపడుతోంది. 89 ఏళ్ల సుశీలకు భర్త లేదు. కుమారుడు ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. భూమి లేదు. గతంలో రేషన్ కార్డు ఉండి పింఛన్ వచ్చేది. ఏడేళ్ల కిందట సాంకేతిక కారణలతో రేషన్‌కార్డులో పేరుపోయింది. దీంతో పింఛన్ కూడా రావడం లేదు. రేషన్ కార్డు, పింఛన్ కోసం ఏళ్ల తరబడి పంచాయతీ కార్యాలయం, నాయకుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. అధికారులు, నాయకులు కొయ్యలగూడెం క్లస్టర్‌కు వస్తున్నారని తెలిసి మరో ప్రయత్నంగా వచ్చి పింఛన్ కోసం ప్రాధేయపడింది. గెలిస్తే ఈ సారి తప్పకుండా ఇప్పిస్తామని నాయకులు ఆమెకు హామీ ఇచ్చి పంపించారు.

మృత శిశువు లభ్యం

భువనగిరి టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని పెద్దచెరువు సమీపంలో గురువారం ఆడశిశువు మృతదేహం లభ్యమైంది. పట్టణ ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని జగదేవ్‌పూర్ రోడ్డు నుంచి పెద్దచెరువుకు వెళ్తున్న మార్గంలోని ఓ వెంచర్‌లో మృత శిశువు ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో సం ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకొని జిల్లాఆసుపత్రికి తరలించారు. సుమారు నాలుగు రోజుల క్రితం జన్మించి ఆడశిశువుగా తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

తుంగతుర్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని సూర్యాపేట తుంగతుర్తి డీటీ చిప్పలపల్లి యాదగిరి అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఫ్లయింగ్‌స్క్వాడ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీల్లో అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. రూ.8,090 విలువైన 5.85 లీటర్ల బీర్లు, 2.75 వైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రావులపల్లి ఎక్స్‌రోడ్‌తండా వద్ద బెల్ట్‌దుకాణాల్లో మద్యం విక్రయిస్తున్న గుగులోతు గోపాల్ వద్ద 9.75లీటర్ల బీర్లు, 1.08లీటర్ల లిక్కర్ స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. వారు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ గురుస్వామి, మమేష్, సాయివర్మ, మధు, మహేష్ ఉన్నారు.

● వలిగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలో అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తుర్కపల్లి(మునగాల) గ్రామానికి చెందిన పబ్బు వెంకటేశ్ కిరాణం దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. అతడి దుకాణాన్ని తనిఖీచేయగా ఆరు బీర్లు, రెండు ఫుల్‌బాటిల్స్, 18 క్వార్టర్లు, మూడు 90ఎంఎల్ బాటిల్స్ మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.సుమారు రూ.6,486 విలువైన 8.91 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వెంకటేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేశారు. సీఐ బొడ్డుపల్లి భాస్కర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామశివారులో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా మల్లాపురం గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి కర్రె వెంకటయ్య ఆదేశానుసారం ప్రచార వాహనాన్ని కర్రె లింగస్వామి నడుతుండగా తనిఖీచేశారు. అందులో మద్యం తరలిస్తుండటంతో పట్టుకుని వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున డబ్బు, మద్యం అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐలు యాదయ్య, కృష్ణస్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకుల బైండోవర్

పెన్‌పహాడ్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలో బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్న పలువురిని పోలీసులు బైండోవర్ చేయించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే రూ.2 లక్షల జరిమానా విధిస్తామని ఎస్ఐ గోపీకృష్ణ తెలిపారు. కార్యాక్రమంలో పీసీ రవీందర్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పలువురికి జైలు

సూర్యాపేట క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు సూర్యాపేట జిల్లా కేంద్ర ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశామన్నారు. వారిని గురువారం సూర్యాపేట కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి పీవీ రమణ ఒకరికి ఒక రోజు జైలు, రూ.2 వేలు జరిమానా, మిగిలిన నలుగురికి కలిపి రూ.6,500 జరిమానా విధించినట్లు తెలిపారు.



తుంగతుర్తి మండల కేంద్రంలో పట్టుబడిన మద్యంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

భర్తపై కోపంతో.. కుమారుడిని వాహనంలో వదిలి...



దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో బాలుడి తల్లి దుర్గాభవానికి కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు

దేవరకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భర్తపై కోపంతో ఐదు నెలల కుమారుడిని అటవీ శాఖ వాహనంలో వదిలివెళ్లిన తల్లిని దేవరకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం నల్లగొండ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా తిప్పర్తికి చెందిన దుర్గాభవానికి సూర్యాపేటకు చెందిన సంతోష్‌తో రెండేళ్లక్రితం వివాహం కాగా, ఐదు నెలల కుమారుడు ఉన్నాడు. సూర్యాపేటలో నివాసం ఉంటున్న సంతోష్, దుర్గాభవాని దంపతుల మధ్య మూడు నెలలుగా వివాదం నెలకొనటంతో ఆమె కుమారుడితో తిప్పర్తికి వచ్చి ఉంటోంది. గురువారం బాలుడితో దేవరకొండకు చేరుకున్న దుర్గాభవాని దేవరకొండ - డిండి రోడ్డులో ఓ హోటల్ వద్ద నిలిపి ఉంచిన అటవీశాఖ వాహనంలో బాలుడిని వదిలిపెట్టి వెళ్లింది. హోటల్ నుంచి బయటకు వచ్చిన అటవీశాఖ సిబ్బందికి వాహనంలో ఉన్న బాలుడు తల్లి కోసం ఏడుస్తుండటంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించి బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. హోటల్ సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు సంఘటనా స్థలానికి సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న దుర్గాభవానికి అదుపులోకి తీసుకుని విచారించగా తన బిడ్డేనని అంగీకరించింది. ఈ నెల 5వ తేదీన బాలుడి తండ్రి సంతోష్‌ను పిలిపించి కౌన్సిలింగ్ చేస్తామని సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. బాలుడు ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణలో క్షేమంగా ఉన్నాడని తెలిపారు. బాలుడిని వదిలిపెట్టి వెళ్లేందుకు భార్యాభర్తల మధ్య గొడవే కారణమని తెలిపారు.

విద్యుదాఘాతంతో గృహిణి మృతి

కట్టంగూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ మహిళ మృతి చెందింది. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం ఈదులూరులో గురువారం జరిగింది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం ఈదులూరు గ్రామానికి ముంత పద్మ(59) కొత్త ఇంటిని నిర్మించుకునేందుకు పాత ఇంటిని కూలగొట్టి దాని పక్కనే తాత్కాలికంగా రేకుల గదిని ఏర్పాటు చేసుకుంది. అయితే రేకుల గదికి ఏర్పాటుచేసిన ఫ్యాన్‌కు ఉన్న తెగిన కరెంటు తీగలు తగలడంతో రేకులకు ఆనుకునే ఉన్న ఇనుపరాడ్‌ను తీయబోయిన పద్మ విద్యుదాఘాతానికి గురై కూలబడింది. గమనించిన భర్త ఎల్లయ్య చూసే సరికి మృతి చెందింది. పద్మ కుమారుడు సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

పొగమంచుతో జాగ్రత్త

● వాహనదారులకు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ సూచనలు



నల్లగొండ క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చలికాలంలో రహదారులపై వెళ్లేవాహనదారులు పొగమంచుతో ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. పొగమంచులో ప్రయాణం సమయంలో రోడ్డుపైన వాహనాలు వెళ్తున్నపుడు పాదాచారులు, జంతువులు, సిగ్నల్స్ సరిగా కనబడవని, ముందు వాహనాలు, ఆగి ఉన్న వాహనాలు ఎంతదూరంలో ఉన్నాయో అంచనా వేయడం డ్రైవర్లకు కష్టమవుతుందని, పొగమంచులో వెళ్లే వాహనదారులు జాగ్రత్తలు తీసుకుంటే గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవచ్చని తెలిపారు.

వాహనదారులు ఇవి పాటించాలి..

- గమ్య స్థానానికి వెళ్లేటప్పుడు ముందుగానే బయలుదేరాలి. పొగమంచు వల్ల ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది ముందుగా బయలుదేరితే డ్రైవింగ్ చేసేటప్పుడు తొందరగా వెళ్లాలనే ఆలోచనను నివారించవచ్చు.
- అతివేగాన్ని, ఓవర్‌టేక్‌ను నివారించాలి. ముందుగా ఉన్న వాహనాలు, రోడ్డు కనిపించకపోవడం వల్ల, వేగంగా వెళ్లే సమయంలో వాహనం అదుపు తప్పే ప్రమాదం ఉంటుంది. ఓవర్‌టేక్ వల్ల ముందున్న వాహనం ఎంత దూరంలో ఉందో అంచనా వేయడం కష్టం.
- పొగమంచు వల్ల హైబీం లైట్ల నుంచి వచ్చే కాంతి విచ్ఛిన్నమయ్యే ముందు చూడడం కష్టమవుతుంది. లోబీం లైట్‌లు ఉండటం వల్ల వెనుక లైట్లు, మిగతా వాహనదారులకు స్పష్టంగా మీ వాహనం ఎంత దూరంలో ఉందో తెలుస్తుంది. ఫాగ్ లైట్లు ఉంటే వాటిని వాడవచ్చు.
- ముందున్న వాహనానికి మీరు వెళ్తున్న వాహనానికి మధ్య సురక్షిత దూరాన్ని పాటించాలి. దీని వల్ల ముందు వెళ్తున్న వాహనం సడన్ బ్రేక్ వేసినా, వాహనం ఎక్కడ ఉందో అంచనా వేయడంతో తప్పు జరిగినా ముందు వాహనాన్ని ఢీకొట్టడాన్ని నివారించవచ్చు.
- నిర్ధేశించిన లేన్లలో వాహనాన్ని నడపాలి. క్రమశిక్షణ లేకుండా నడిపితే ముందున్న వాహనాలను గుర్తించడం కష్టమవుతుంది.
- వాహనాలు నడిపేటప్పుడు కిటికీ అద్దాలను కొద్దిగా దించాలి. అద్దాలను దించడం వల్ల పొగమంచు ఒకే దగ్గర కేంద్రీకృతం కాకుండా విచ్ఛిన్నమవుతుంది. దీని వల్ల డ్రైవర్ దృష్టి మెరుగుపడుతుంది.
- పొగమంచు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కాసేపు వాహనాన్ని ఆపి తర్వాత ప్రయాణం కొనసాగించాలి. రోడ్డు సరిగా కనపడకపోతే వాహనాన్ని నడపవద్దు. ముందున్న వాహనం ఎంత దూరం ఉందో అంచనా వేయడం కష్టం. గమ్య స్థానానికి వెళ్లే తొందరలో పొరపాటు చేయవద్దు.
- వాహనానికి సంబంధించిన కిటికీ అద్దాలను వెనక ఉన్న అద్దాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పొగమంచు అద్దాలపై పడితే దృష్టి తగ్గుతుంది. వాహనానికి ఉన్న వైపర్లను, డీఫ్రాస్టర్‌లను అవసరాన్ని బట్టివాడాలి.
- మీరు ఏటు వైపు వెళ్తున్నారో వెనుకవచ్చే వాహనానికి ముందుగా తెలిసే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే వెనకవచ్చే వాహనం ముందున్న వాహనం ఏటు వెళ్తుందో అంచనా వేయడంలో తప్పు జరగవచ్చు. వెనక వచ్చే డ్రైవర్లకు కొంత సమయం ఉండేటట్లు ఇండికేటర్లతో సిగ్నల్ ఇవ్వాలి.
- చలికాలంలో రోడ్డు తడిగా ఉండటం వల్ల వాహనాలు స్కిడ్ అవడంతో పాటు స్లిప్ అవుతాయి. నిర్దిష్ట స్పీడ్‌తో వాహనాలు నడిపితే రోడ్ల నుంచి వాహనాలను స్లిప్ కాకుండా నివారించవచ్చు. ఒక్కసారిగా బ్రేక్ వేస్తే వాహనం అదుపుతప్పే ప్రమాదం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని బ్రేక్‌లను నెమ్మదిగా వాడాలి.

పుడమికి పుట్టెడు శోకం

- మనిషి ఉనికి, జీవనానికి మూలాధారం మట్టి
- నిస్సారం నుంచి నేలను కాపాడుకుందాం
- నేడు ప్రపంచ మృత్తిక దినోత్సవం



రైతులకు మట్టి పరీక్షల గురించి అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త కిరణ్ (ఫైల్)

మనిషి ఉనికికి, జీవనానికి మట్టి మూలాధారం. ఆరోగ్యవంతమైన నేల ఉన్నప్పుడే జనాభాను పోషించడానికి కావల్సిన ఆహారోత్పత్తి సాధ్యమవుతుంది. నానాటికీ నేల పైపొర దెబ్బతింటోంది. కాలుష్యం బారిన పడి భూమి నేడు నిస్సారమవుతోంది. ఇది ఆహార భద్రతపై ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా సూర్యాపేట జిల్లా గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం మృత్తిక శాస్త్రవేత్త అరిగెల కిరణ్ మట్టి ప్రాముఖ్యతను వివరించారు.

- ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ వ్యవసాయం

నేలను సంరక్షించేందుకు మొదటగా 2002లో ఇంటర్నేషనల్ యూనియన్ నేల (ఐయూఎస్ఎస్) దినోత్సవం కోసం ప్రతిపాదించింది. తర్వాత ఫుడ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్(ఎఫ్ఏవో)2013లో మద్దతు నిచ్చింది. యునైటెడ్ నేషన జనరల్ అసెంబ్లీ(యుఎన్‌జీఏ) 2013లో డిసెంబరు 5న ప్రపంచ నేల దినోత్సవంగా ప్రకటించింది. మట్టి క్షీణత, పోషకాల కొరత రసాయనాల అధిక వినియోగం, వాతావరణ మార్పులు వంటి సమస్యలపై అవగహన పెంచడం కోసం ఆహార భద్రతకు పర్యావరణానికి మట్టి ఎంత ముఖ్యమో ప్రపంచానికి గుర్తు చేయడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. మృత్తిక దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది 2025ను ఆరోగ్యమైన నేలలు-ఆరోగ్య నగరాలకు పునాదిగా నిర్ణయించారు. ఆహార భద్రత, నీటి నాణ్యత, పర్యావరణ స్థిరత్వం వంటి అంశాలను మెరుగు పరచడంలో నేల పోషించే పాత్రను చాలా కీలకమైనది. నగరాల్లో నేల ఆరోగ్యం కాపాడటం అంటే కేవలం ఆహారోత్పత్తికి మాత్రమే కాక కాలుష్యాన్ని తగ్గించడం, వర్షపు నీటిని భూమిలోకి ఇంకించుకునే సామర్థ్యాన్ని పెంచడం, తద్వారా పర్యావరణ స్థిరత్వాన్ని సాధించడం అని నిపుణులు చెబుతున్నారు.

ఆహార భద్రత: ఆరోగ్యమైన నేలలు, స్థిరమైన పట్టణ వ్యవసాయానికి దారి తీసి నగరాల్లో ఆహార లభ్యతను పెంచుతాయి.

జీవ వైవిధ్యం: నేలలోని సూక్ష్మజీవులు, ఇతర జీవులు జీవ వైవిధ్యాన్ని కాపాడతాయి.

పర్యావరణ మెరుగుదల: నేల నాణ్యత, మెరుగైతే నీటి చొరబాట్లు పెరుగుతాయి. కాలుష్యం తగ్గుతుంది.

క్షీణిస్తున్న నేల నాణ్యత కారణాలు, పర్యవసానాలు

నేల సంరక్షణపై ప్రత్యేక దృష్టి అవసరం కావడానికి ప్రధాన కారణం వ్యవసాయం, ప్రధాన జిల్లాల్లో నేల నాణ్యత క్షీణించడం, నిరంతరంగా వాడుతున్న రసాయన ఎరువులు, అదుపులేని నీటి వినియోగం నేల క్రమక్షయం, సూక్ష్మ పోషకాల కొరత, వంటి సమస్యలతో మట్టి నాణ్యత, ప్రతి సంవవత్సరం తగ్గిపోతుంది. ఇది భవిష్యత్‌లో పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది.

రైతులు పాటించాల్సిన పద్ధతులు

- రెండు సంవత్సరాలకు ఒకసారి మట్టి పరీక్షలు చేయించాలి.
- పరీక్ష ఫలితాల ఆధారంగా లోపించిన పోషకాలకు తగ్గట్టు ఎరువుల పరిమాణాన్ని నిర్ణయిస్తే అనవసర రసాయనాల వినియోగం ఖర్చు తగ్గుతుంది.
- సేంద్రియ ఎరువుల వాడకం పెంచడం అత్యంత ప్రయోజనకరం, పశువుల ఎరువు, పచ్చి రొట్ట కంపోస్టు వంటి సేంద్రియ పదార్థాలు భూసార నాణ్యతను మెరుగు పరుస్తాయి.
- నీటి నిర్వహణలో భాగంగా బిందు సేద్యం స్ప్రింకర్ల వంటి పద్ధతులు ఉపయోగిస్తే నీటి ఆదా అవుతుంది. అంతేకాకుండా నేల క్రమక్షయం నివారిస్తుంది.
- పంట మార్పిడితో నేల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుంది. వరి, కంది, పప్పు ధాన్యాలు వంటి పంటలను మారుస్తూ వేయడంతో నేలకు విశ్రాంతి లభించి పోషక సమతుల్యత మెరుగుపడుతుంది.
- పంట అవశేషాలను నేలలో కలపడం ద్వారా నేలలో సేంద్రీయ కర్బనం పెరిగి మట్టిలోని సూక్ష్మ జీవులు సురక్షితంగా ఉంటాయి.
- మల్చింగ్ పద్ధతి ఉపయోగించడం మంచిది. నేలపై ఆకులు, గడ్డి వంటి పదార్థాలను కప్పితే నేలలో తేమ నిల్వ ఉండి కలుపు మొక్కల పెరుగుదల తగ్గుతుంది. ఈ పద్ధతులను అనుసరించడం ద్వారా రైతులు భూమి ఆరోగ్యాన్ని ధృఢంగా కాపాడుకోవచ్చు. ఉత్పాదకతను పెంచుకోవచ్చు.



'టెట్'తో ఉపాధ్యాయుల్లో ఆందోళన

● ఉపాధ్యాయుల సమస్యలు పార్లమెంట్‌లో ప్రస్తావించిన భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



భువనగిరి టౌన్, మోత్కూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్షకు తప్పనిసరి చేయడంతో వారిలో ఆందోళన నెలకొందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. టెట్ పరీక్షపై ఆయన గురువారం పార్లమెంట్ సమావేశాల్లో మాట్లాడారు. 2010 ఆగస్టు 23వ తేదీకి ముందు నియమితులైన ఉపాధ్యాయులందరికీ టెట్ పరీక్ష తప్పని సరికాదని అన్నారు. అయితే గతంలో సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష తప్పనిసరి కాదని ప్రభుత్వాలు చెప్పడంతో అప్పట్లో పలువురు పరీక్షకు గైర్హాజరయ్యారని, కానీ అకస్మాత్తుగా టెట్ అర్హత తప్పనిసరి పేర్కొనడం వారికి అన్యాయం చేసినట్టేనని అన్నారు. అవసరమైతే ఆర్‌టీఈ 2009, ఎన్‌సీటీఈ 1993 చట్టాలను సవరించాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల సానుకూలత చూపాలన్నారు. తమ వినతి మేరకు ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి పార్లమెంటులో ఉపాధ్యాయుల సమస్యను ప్రస్తావించారని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ముక్కెర్ల యాదయ్య తెలిపారు.

జాతీయస్థాయిలో విద్యార్థుల ప్రతిభ

● 11 అవార్డులు సొంతం చేసుకున్న హుజూర్‌నగర్ గురుకుల విద్యార్థులు



అవార్డులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఎస్సీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆర్ట్ విభాగంలో 11 అవార్డులు సాధించారు. ప్రిన్సిపాల్ దున్నా వెంకటేశ్వర్లు, ఆర్ట్ టీచర్ సూరేపల్లి నాగజాన్‌కు జాతీయ కళాతపస్వి అవార్డును అందజేశారు. దేశ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో జరిగిన మాస్టర్ ఆర్ట్ కాంపిటిషన్ లెవల్-1 విభాగంలో విద్యార్థులు బంగారు పతకాలు, సిల్వర్ పతకాలు సాధించారు. జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో స్టిల్ లైఫ్ పెయింటింగ్‌లో 9వ తరగతి విద్యార్థి చడపంగు సాయినవీన్, ఆర్ట్‌మేస్ట్రో అవార్డు, అండ్ ట్రోఫీ, గోల్డ్ మెడల్ సాధించారు. అదేవిధంగా అభిషేక్, గోపి, మధుబాబు, హర్షిత్, మైకిల్, శివకుమార్ కూడా గోల్డ్ మెడల్స్ సాధించారు. కాగా టి. ఉదయ్, ఉదయ్‌కిరణ్, అజయ్‌కుమార్, ఆకాశ్‌లు సిల్వర్ మెడల్స్ సాధించారు. జాతీయస్థాయి మాస్టర్ ఆర్ట్ కాంపిటీషన్‌లో టాటూ మేకింగ్, స్కెచ్, గ్రీటింగ్ కార్డు మేకింగ్, కొలాజ్, ఫొటోగ్రఫీ, కార్టూన్ మేకింగ్, కలరింగ్, హ్యాండ్ రైటింగ్, స్టిల్ లైఫ్ పెయింటింగ్, క్యారిచేయింగ్, వివిధ విభాగాల్లో, ఆర్ట్ విభాగంలో గురుకుల విద్యార్థులు జాతీయ లెవెల్ గ్లోబల్ అవార్డు సాధించారు. కాగా ఎస్సీ గురుకుల పాఠశాలకు గ్లోబల్ ఆర్ట్ అవార్డు కైవసం చేసుకుంది. ఆన్‌లైన్‌లో నవంబరు మొదటి వారంలో ఆర్ట్ విభాగంలో పోటీలు నిర్వహించగా విద్యార్థులు, ప్రిన్సిపాల్ ఆర్ట్ టీచర్ అవార్డులు కైవసం చేసుకున్నారు. కాగా గురువారం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, ప్రమీల, నందానాయక్, వెంకన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నాలుగు నెలల ఆదాయం రూ.1.23లక్షలు

భక్తులు పెరుగుతున్నా తగ్గుతున్న రేణుకాఎల్లమ్మ ఆలయ ఆదాయం

భువనగిరి టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణ శివారులోని రేణుక ఎల్లమ్మ ఆలయానికి నాలుగు నెలల ఆదాయం రూ.1,23,160లు వచ్చింది. ఆలయానికి భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నా ఆదాయం మాత్రం గతంతో పోలిస్తే భారీగా తగ్గింది. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హుండీ నాలుగు నెలలుగా భక్తులు సమర్పించిన హుండీ కానుకలు గురువారం లెక్కించగా రూ.1,23,160 మాత్రమే ఆదాయం లభించింది. రెండేళ్ల క్రితం వరకు హుండీ ద్వారా నెలకు రూ.లక్షకు పైగా ఆదాయం లభించేది. కానీ ఆలయ హక్కులపై ప్రస్తుత నిర్వహకులు, ఎండోమెంట్ శాఖ మధ్య కొంతకాలంగా వివాదం నెలకొని హైకోర్టు పరిధిలోకి చేరింది. అప్పటి నుంచి ఇరువర్గాల మధ్య కోర్టు వాయిదాల పర్వం కొనసాగుతోంది. సుమారు మూడేళ్ల క్రితం కోర్టు ఆదేశాల మేరకు ఎండోమెంట్ శాఖ ఆలయాన్ని స్వాధీనం చేసుకోగా కొన్ని రోజులకే కోర్టును ఆశ్రయించి ప్రస్తుత నిర్వాహకులు అప్పట్లోనే ఆలయాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. గతంలో పలుమార్లు హుండీ చోరీకి కూడా గురైంది. మరో సందర్భంలో తాళం వేసి ఉన్న హుండీ నుంచి భక్తులు సమర్పించిన కానుకలను తస్కరించిన ఘటనలు కూడా ఉన్నాయి. హుండీ ద్వారా భక్తులు సమర్పించిన సుమారు కోటి రూపాయలు ఎండోమెంట్ శాఖ పేరిట బ్యాంకులో డిపాజిట్‌గా ఉన్నవి. ఇప్పటికైనా భక్తుల మనోభావాలకు అనుగుణంగా ప్రభుత్వం ఆలయ నిర్వాహణపై చర్యలు తీసుకోవాలని, కోర్టు వివాదం పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఎండోమెంట్ అధికారి నిఖిల్, ఈవో నరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో హుండీ లెక్కించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



బహిరంగ లేఖ పత్రాలు విడుదల చేస్తున్న బీసీ సంఘం నాయకులు

దేవరకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, చట్టభద్రత కల్పించాలని, దేవరకొండ నియోజకవర్గంలోని ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించాలని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా దేవరకొండలో సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన బహిరంగ లేఖ పత్రాలను గురువారం విడుదల చేసి మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, వృత్తి విద్య కోర్సులు ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గంలో మహిళా డిగ్రీ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.6500 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదలచేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు భాస్కరచారి, కోటేశ్వర్‌రావు, చౌహాన్, శ్రీనివాసచారి, అంకం చంద్రమౌళి, శివగౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటి మట్టం 579.20 అడుగులు

నాగార్జునసాగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 579.20 అడుగులుగా (280.6992టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 9,500 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 6,097 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 16,797 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువ నుంచి 16,797 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి వరదకాల్వకు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి నీటి విడుదలను నిలిపివేశారు.

పల్లెపోరు.. కళ తప్పిన పట్టణ వ్యాపారం

● పట్టణాలకు తగ్గిన గ్రామస్థుల రాక ● గిరాకీలు తగ్గి వ్యాపారాలు డీలా ● పట్టణాల్లో వ్యాపారంపై ఎన్నికల ప్రభావం



భువనగిరి టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రభావం పట్టణాలపై పడుతోంది. పట్టణాలు, గ్రామాల్లోని కూలీల అధారిత పనులకు అంతరాయం ఏర్పడింది. గ్రామాల నుంచి వచ్చేవారి సంఖ్య తగ్గడంతో పట్టణాల వ్యాపారాలు తగ్గాయి. మూడు దఫాలుగా జరగనున్న ఎన్నికలు ముగిసే వరకు ఇలాగే ఉంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. వివాహాలకు శుభ ముహూర్తాలు లేకపోవడంతో, గ్రామపంచాయతీ ఎన్నికల కారణంగా వ్యాపారాలు తగ్గడంతో పలువురు వ్యాపారులు బిజినెస్ హాలీడేస్‌గా భావిస్తూ భావిస్తూ తమకు నచ్చిన విహార, ఆధ్యాత్మిక యాత్రలకు వెళ్తున్నారు.

పనులపై ప్రభావం..

పనుల నిమిత్తం గ్రామస్థులు ప్రతిరోజూ తమ సమీపంలోని పట్టణ ప్రాంతాలకు వచ్చి పోతుంటారు. కానీ గ్రామాల్లో ఎన్నికల హడావిడితో గ్రామస్థులు పట్టణాలకు తాత్కాలికంగా రావడం తగ్గించినట్లు తెలుస్తోంది. అత్యవసరమైన ఆసుపత్రి తదితర పనుల కోసం వస్తూ వెంటనే ముగించుకొని తిరుగుబాట పడుతున్నారు. బస్సుల్లో, ఆటోల్లో ప్రయాణికుల సంఖ్య తగ్గగా, పలు దుకాణాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. హోటళ్లు, గ్రామస్థులతో కిటకిటలాడే పట్టణాల్లోని అడ్డాల్లో సందడి తగ్గింది. ఇళ్లలో పని చేస్తున్న మహిళలు సైతం కొద్దిరోజుల పాటు రాబోమని ముందుగానే చెబుతుండడం గమనార్హం. వ్యవసాయ పనులకు వెళ్లేందుకు కూలీలు విముఖత చూపుతుండడంతో వరి నాటు పనులను ఎన్నికలు ముగిసే వరకు వాయిదా వేసుకున్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు. అలాగే పలు రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు ఉన్నప్పటికీ గ్రామాలకు చెందిన పలువురు భవన నిర్మాణ తదితర రంగాలలో కూలీ పనులను వచ్చే వారు. కానీ ఎన్నికల సీజన్‌తో వారందరూ పనులకు ముఖం చాటేస్తున్న పరిస్థితి. అలాగే ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు కూలీలను, కార్మికులకు అక్కడి ఎన్నికల అభ్యర్థులు చేస్తున్న ప్రభావితంతో సెలవులు తీసుకుని ఊరిబాట పడుతుండడంతో పట్టణాలలోని దుకాణాలు, వ్యవసాయ బావుల వద్ద, భవనాలు, అపార్ట్‌మెంట్లు పనుల ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అయితే పట్టణాలలోని కళాకారులకు గ్రామ పంచాయతీ ఎన్నికలతో ఉపాధి లభిస్తుండటం విశేషం. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల గుణగణాలను, లక్ష్యాలను, సేవా తత్పరతను చాటుతూ రాసిన పాటలను రికార్డింగ్ చేసి ఒక్కో పాటకు రూ.10వేల వరకు కళాకారులు లబ్ధిపొందుతున్నారు.

ఎంపిక చేసుకున్న దుకాణాల్లో...

గెలుపే లక్ష్యంగా బరిలోకి తిగిన అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేసేందుకు పట్టణాల్లో ఎంపిక చేసుకున్న కొన్ని దుకాణాల్లో పెద్ద మొత్తంలో తాయిలాలు కొనుగోలు చేస్తున్నట్లు ప్రచారం. వస్త్ర దుకాణాల్లో చీరలు, డ్రెస్సులు, జ్యువెల్లరీలలో వెండి కుంకుమ భరణిలు, కాళ్ల వెండి పట్టీలు కొనుగోలు చేస్తున్నట్లు ప్రచారం. పోటీ చేస్తున్న వారు ఈ పాటికే కొనుగోలు లేదా ఆర్డర్ ఇచ్చినట్లు సమాచారం.

పత్తి సాగు కాలాన్ని పొడిగిస్తే నష్టం

● ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి ● రైతులకు కేవీప శాస్త్రవేత్త చంద్రశేఖర్ సూచనలు



ఈ వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పత్తి సాగు కాలాన్ని పొడిగిస్తే రైతులకు నష్టం కలుగుతుందని, పత్తి పంటను తొలగించి దాని స్థానంలో ప్రస్తుతం ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ రైతులకు సూచించారు.

- ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ వ్యవసాయం

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏడు లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు పత్తి పంటలో గులాబీ రంగు పురుగు ఉధృతికి అనుకూలంగా ఉన్నాయి.
- డిసెంబరు నెల చివరి నాటికి పత్తితీత పూర్తి చేసుకోవాలి. పంట కాలాన్ని జనవరి వరకు పొడిగిస్తే పంటలో గులాబీరంగు పురుగు సంతతి పెరిగి గుడ్డి(నాణ్యతలేని) పత్తి ఎక్కువగా వస్తుంది. వచ్చే ఏడాది సాగు చేసే పంటను ఆశించి నష్టం చేస్తుంది.
- పత్తి ఏరిన తర్వాత చేనులో పశువులను, గొర్రెలు, మేకలు మేపుకోవాలి.
- పత్తి కట్టెను కాల్చివేస్తే భూమిలో ఉన్న మిత్రపురుగులు నశించి భూమికి నష్టం జరుగుతుంది. పురుగు ఆశించిన పంటను నిల్వచేస్తే దెబ్బతింటుంది.
- పత్తిచేను కట్టెను రోటావేటర్ లేదా షెడ్డర్ సహాయంతో భూమిలో కలియదున్నితే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.
- పత్తి పంటను తొలగించిన భూమిలో నీటి వసతి ఉంటే రెండో పంటగా ఆరుతడి పంటలైన పెసర, మినుము, వేరుశనగ, నువ్వులు లేదా కూరగాయలు వంటివి సాగు చేసుకుంటే రైతులకు ప్రయోజనంతో పాటు భూమికి కావాల్సిన పోషకాలు అందుతాయి.

వరి నారుమళ్లకు రక్షణ ఇలా..

చౌటుప్పల్ టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మండలంలో వరి నారు మళ్లకు జంతువుల నుంచి రక్షణకుగాను రైతులు చర్యలు చేపట్టారు. అడవి పందులు, నెమళ్లు, కోతుల బెడద నుంచి రక్షణ పొందడానికి వరి నారు మళ్ల చుట్టూ రంగు రంగుల వస్త్రాలను కట్టారు. ప్రధానంగా అటవీ, గుట్టల ప్రాంతాల్లో వీటి బెడద అధికంగా ఉండడంతో రైతులు ఇలాంటి చర్యలను చేపట్టారు. రంగు, రంగుల వస్త్రాలను చూసి జంతువులు భయపడి దూరంగా వెళ్లి పోతాయని, లేనిపక్షంలో నారుమళ్లు నాశనం చేస్తాయని రైతులు పేర్కొంటున్నారు.



లక్కారంలో నారుమడికి చుట్టూ ఏర్పాటు చేసిన వస్త్రాలు

సూర్యాపేట
కోదాడ-హుజూర్‌నగర్-తుంగతుర్తి

మున్సిపల్ కేంద్రంలో కుక్కల భౌ.భౌ

● గుంపులు.. గుంపులుగా తిరుగుతున్న వైనం ● బయటికి రావాలంటే భయం.. భయం

తిరుమలగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతోంది. వార్డుల్లో, రోడ్లపైన ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. వీటిలో పిచ్చికుక్కలు కూడా ఉన్నందున ప్రజలు తీవ్ర భయాందోళనతో ఉన్నారు. ఎప్పుడు? ఎక్కడ? కుక్కలు కరుస్తాయోనన్న భయంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావాలంటే జంకుతున్నారు. రోడ్లపైన, వీధుల్లో ప్రజలను, వాహనాలను కుక్కలు వెంబడిస్తూ, తరుమడంతో వాహనదారులను అదుపుతప్పి కిందపడి గాయపడుతున్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధుల వెంట పడి కుక్కలు తీవ్రంగా గాయపరిచిన ఘటనలు అనేకం ఉన్నాయి. దీంతో చీకట్లో బయటకు రావాలంటు ప్రజలు భయపడుతున్నారు.



కుక్క కరవడంతో మహిళ చేతికి అయిన గాయం

● మునిసిపల్ కేంద్రంలోని జాతీయ రహదారులైన త్రిపురార్-వలిగొండ, సూర్యాపేట- జనగామ రోడ్లవెంట చికెన్, మటన్ దుకాణాల యజమానులు వ్యర్థాలను రోడ్ల వెంట పారేస్తున్నారు. ఈ వ్యర్థాలను తిన్న కుక్కలు పేట్రేగిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. విద్యార్థులకు బస్సుల్లో పాఠశాలలకు పంపాలన్నా, తీసుకురావాలన్నా కుక్కలు దగ్గరకు రాకుండా కర్రలతో కాపలా ఉంటున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని కోరుతున్నారు.

ఆరు నెలల్లో 50మందిని కరిచిన కుక్కలు

గత ఆరు నెలల్లో మునిసిపాలిటీ పరిధిలో, మండంలోని వివిధ గ్రామాల్లో 50ని కుక్కలు కరిచినట్లు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.



తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

కుక్కల బెడద నివారించాలి



మునిసిపల్ కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గుంపు గుంపులుగా తిరుగుతూ వాహనాలను వెంబడిస్తున్నాయి. చీకట్లో బయటకు రాలేకపోతున్నాం. మునిసిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడద నివారించాలి

● పులిమామిడి బిక్షం, తిరుమలగిరి

ఎన్నికల బరిలో తాజా మాజీ సర్పంచ్‌లు

● పలు పార్టీల మద్దతుతో నాయకుల నామినేషన్

హుజూర్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో తాజా మాజీ సర్పంచ్‌లు మళ్లీ బరిలో నిలిచారు. దీంతో గ్రామాల్లో పోటీ రసవత్తరంగా మారింది. హుజూర్‌నగర్ మండలంలో 11 గ్రామపంచాయతీలకు మూడవ విడత ఎన్నికలు జరగనున్నాయి. కాగా మండలంలోని మేజర్ పంచాయతీలుగా ఉన్న గ్రామాలలో తాజా మాజీలు బరిలో నిలవడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. మండలంలోని వేపలసింగారం, బూరుగడ్డ, అమరవరం, సీతారాంపురం, గ్రామాలలో నిన్నమొన్నటి వరకు సర్పంచ్‌లుగా ప్రాతినిధ్యం వహించిన నాయకులు తిరిగి పోటీలో నిలబడ్డారు. వేపలసింగారం సర్పంచ్ స్థానం జనరల్ మహిళకు రిజర్వ్ కాగా గతంలో సర్పంచ్‌గా పనిచేసిన తాజా మాజీ అన్నెం శిరీషకొండారెడ్డి బీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేస్తున్నారు. అమవరం గ్రామంలో జనరల్ మహిళ స్థానంలో తాజా మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ మద్దతుతో గుజ్జుల సుజాతఅంజిరెడ్డి, బూరుగడ్డ గ్రామంలో బీఆర్ఎస్ మద్దతుతో తాజామాజీ సర్పంచ్ షేక్ సలీమాతో పా సీతారాంపురం గ్రామ తాజా మాజీ సర్పంచ్ అద్దంకి సైదేశ్వరరావులు పోటీ చేస్తుండడం గమనార్హం. ఇదిలా ఉండగా లక్కవరం గ్రామంలో మాజీ ఉపసర్పంచ్‌గా పనిచేసి గౌని లింగస్వామియాదవ్ ఈసారి జనరల్ స్థానంలో బీసీ అభ్యర్థిగా పోటీ చేస్తుండడం గమనార్హం.

మందకొడిగా నామినేషన్ల పర్వం

మేళ్లచెర్వు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా నామినేషన్ల పర్వం రెండో రోజు గురువారం కూడా మందకొడిగా సాగింది. మండల వ్యాప్తంగా ఉన్న 16 గ్రామపంచాయతీలకు సర్పంచ్ అభ్యర్థులుగా 18మంది నామినేషన్లు వేశారు. 8 గ్రామ పంచాయతీలకు ఒక్క నామినేషన్ కూడా కాకపోవడం విశేషం. 152 వార్డులకు గురువారం సాయంత్రానికి 42 నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం చివరి రోజుతో పాటు ముహూర్తం బాగున్నందున నామినేషన్ వేయడానికి అభ్యర్థులు సన్నద్ధంగా ఉన్నారు.

ఇరు పార్టీల మద్దతుతో నామినేషన్

చింతలపాలెం, డిసెంబరు 4: మండలంలోని దొండపాడు గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్, టీడీపీల మద్దతుతో చెన్నకేశి వెంకయ్య గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా రెండు పార్టీల స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి పంచాయతీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరాల కొండారెడ్డి, గోపిరెడ్డి పుల్లారెడ్డి, చిలకల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండా వీరారెడ్డి, గోపిరెడ్డి, పుల్లారెడ్డి, పంట చిన్న కోటిరెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ దొంగల కార్తీక్ యాదవ్, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కొండా శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ అన్నపురెడ్డి గోవిందరెడ్డి, రేపూరి రాంబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగ వేణు, దొంగల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేత



కోక్యానాయక్‌తండాలో నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులు

తిరుమలగిరి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏకగ్రీవంగా ఎన్నికైన కోక్యానాయక్‌తండా, రాజ్యానాయక్‌తండా, సిద్దిసముద్రం తండా, మొండిచింతతండా గ్రామాల సర్పంచ్, ఉప సర్పంచ్ అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గురువారం నియామకపత్రాలు అందజేశారు. కోక్యానాయక్ తండా ఉప సర్పంచ్‌గా గుగులోతు సురేందర్, రాజ్యానాయక్‌తండా ఉప సర్పంచ్‌గా మాలోతు మోహన్, సిద్దిసముద్రంతండా ఉపసర్పంచ్‌గా ధరావత్‌బాలును ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి మల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి సత్యనారాయణరెడ్డి పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

మద్దిరాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లమడవ గ్రామంలో ఎం. కిరణ్ బీఆర్ఎస్‌కు గురువారం రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిటీ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వెంకన్నయాదవ్ మాట్లాడుతూ పేదల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసంపెల్లి వెంకటరెడ్డి, తీకుళ్ల సుధాకర్‌రెడ్డి, వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బిక్షునాయక్, కస్తూరి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

గరిడేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు జోగు అరవిందరెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు గురువాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో మండలంలో సీనియర్ నాయకుడిగా ఉంటూ తన తల్లిని పొనుగోడు గ్రామ సర్పంచ్‌గా గెలిపించుకోవడంతో పాటు పార్టీ అభివృద్ధికి కృషి చేశానన్నారు ప్రస్తుతం కొందరు సొంత నిర్ణయాలతో పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తున్నా పట్టించుకునే దిక్కే లేదని, పార్టీని సమన్వయం చేయడంలో నాయకత్వం విఫలమైనందున బీఆర్ఎస్‌కు రాజీనామా చేసినట్లు తెలిపారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేట టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారుల విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వైట్‌హౌజ్‌లో ఆత్మకూర్(ఎస్) మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మొదటి విడతలో.. ప్రచారం షురూ

(5వ పేజీ తరువాయి)

నిబంధనలకు అనుగుణంగా లేని నామినేషన్లను తిరస్కరించారు. ఈ నెల 6వ తేదీ సాయంత్రం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. 8 మండలాల పరిధిలోని 181 సర్పంచ్‌లకు 1,255 నామినేషన్లు, 1,628 వార్డులకు 4,286 నామినేషన్లు చెల్లుబాటయ్యాయి.

మూడో విడతలో నామినేషన్ల స్వీకరణ

జిల్లాలో మూడో విడత పంచాయతీలకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతోంది. నేటితో నామినేషన్లకు గడువు ముగియనుంది. ఏడు మండలాల పరిధిలోని 146 పంచాయతీలు, 1,318 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం 38 గ్రామాల్లో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ నెల 3వ తేదీ నుంచి ఈ నెల 5వ తేదీ వరకు నామినేషన్ పత్రాలను స్వీకరిస్తారు.

ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలి



తుంగతుర్తిలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

తుంగతుర్తి, నూతనకల్ డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. ఎన్నికల నియమ నిబంధనలపై అభ్యర్థులకు గురువారం తుంగతుర్తి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో, నూతనకల్ పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డబ్బు పంచడం, మద్యం తాగించడం, బహుమతులు పంచడం వంటి కార్యక్రమాలతో ఓటర్లను ప్రలోభ పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతుల మేరకే లౌడ్ స్పీకర్లు, వాహనాలను వినియోగించాలన్నారు. ఉద్రిక్తతలు కలిగించే పోస్టులను సోషల్ మీడియాలో పెట్టొద్దన్నారు. ఎన్నికలు ప్రశాంతగా జరిగేలా పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల వ్యయ పరిశీలకురాలు ఇందిర, తహసీల్దార్లు దయానందం, శ్రీనివాసరావు, ఎంపీడీవోలు శేషుకుమార్, సునీత, సీఐ నరసింహారావు, ఎస్‌ఐలు క్రాంతికుమార్, ఆర్. నాగరాజు, సర్పంచ్, వార్డు పదవులకు పోటీ చేసే అభ్యర్థులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా అమలులో పోలీస్ యాక్టు

● కోదాడ టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్టు-30 ఈ నెల 31వ తేదీ వరకు అమలులో ఉందని కోదాడ పట్టణ సీఐ కే.శివశంకర్ తెలిపారు. గురువారం కోదాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాణసంచా కాల్చడానికి, డీజేలు ఏర్పాటు చేయడా నికి అనుమతిలేదన్నారు. సోషల్ మీడియాలో వివాదస్పద పోస్టులను వైరల్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

● అర్వపల్లి: ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలని తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. గురువారం అర్వపల్లిలో సర్పంచ్, వార్డు సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాగారం సీఐ నాగేశ్వర్‌రావు, ఎంపీడీవో ఝాన్సీ ఎస్‌ఐ సైదులు, ఎంపీవో గోపి, ఏఎస్‌ఐ రాములు పాల్గొన్నారు.

● మద్దిరాల: ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. గురువారం మద్దిరాల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను ప్రలోభాలకు గురిచేయొద్దని, దేవాలయాలు, పాఠశాలల సమీపంలో సమావేశాలు నిర్వహించొద్దని అన్నారు. శాంతియుతంగా స్నేహపూర్వక వాతావరణంలో పంచాయతీ ఎన్నికలను నిర్వహించుకోవాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ అయేషాపర్వీనా, తుంగతుర్తి సీఐ నర్సింహ, ఎస్‌ఐ వీరన్న, ఎన్నికల నిర్వహణ అధికారి మంజుల, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● మఠంపల్లి: ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలని మఠంపల్లి ఎస్‌ఐ పి.బాబు సూచించారు. ఎన్నికల నియమావళిపై గురువారం మండలంలోని పలు గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

● ఆత్మకూర్(ఎస్): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నియమావళికి లోబడి ఉండాలని సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ అన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు గురువారం మండల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు 5వేల లోపు జనాభా కలిగిన గ్రామాల్లో రూ.1.50లక్షలకు మించి ఖర్చు చేయరాదన్నారు. వార్డు సభ్యులు రూ.30వేలకు మంచి ఖర్చుచేయరాదన్నారు. అ కార్యక్రమంలో ట్రైనీ అధికారి పబ్బతి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో హసీం, తహసీల్దార్ అమిన్‌సింగ్, ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్, ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఆనంద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయస్వామి జయంతి

సూర్యాపేట టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సాయిబాబా దేవాలయంలో గురువారం దత్తాత్రేయ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు విశ్వేశ్వరశర్మ, గంగాధరశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో స్వామిని అలంకరించారు. వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్టు అధ్యక్షుడు కర్నాటి రవి, రేణుక, మల్లికార్జున్, శిరీష, భక్తులు పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్: పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో శ్రీదత్త జయంతిని అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం పట్టణంలో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. స్వామికి రాత్రి వేళ పల్లకిసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు త్రిపురమళ్ల అంజయ్య, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి నాగేశ్వరరావు, కోశాధికారి శేఖర్, ఆకుల రాము, గజ్జి ప్రభాకర్, కుక్కడపు రామ్మోహన్‌రావు, ఏలూరి రాంబాబు, గుండా రమేష్, కొత్తా శ్రీనివాసరావు, పోలిశెట్టి నర్సింహారావు, అనంతరాములు, వెంకటేశ్వర్లు, సీతారామయ్య, దయాకర్, ప్రతాప్‌రెడ్డి, వెంకన్న, నాని పాల్గొన్నారు.



సూర్యాపేటలోని సాయిబాబా ఆలయంలో దత్తాత్రేయస్వామికి మొక్కుతున్న భక్తులు

పోలీసులపై చర్యలు తీసుకోవాలి: కోటేష్



చిలుకూరులో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వడ్డేపల్లి కోటేష్, నాయకులు

చిలుకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కర్ల రాజేష్ మృతికి కారకులైన పోలీసులపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్ అన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో గురువారం చిలుకూరులోని దళితవాడలో అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఎదట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుడు రాజేష్ను మృతిపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోదాడలో ఈ నెల 10వ తేదీన నిర్వహించే రాజేష్ సంతాప సభ ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మల్లెపంగు సూరిబాబు, వడ్డేపల్లి రామకృష్ణ, కందుకూరి ఎల్లయ్య, వీరబాబు, సైదులు, శివాజీ, మేరిగ రామారావు, ఉపేందర్, జిల్లా శ్రీను, అశోక్, లచ్చయ్య, రాంబాబు, తిరుపయ్య పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్య ఆశయాలు సాధించాలి

హుజూర్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కొణిజేటి రోశయ్య ఆశయాలు సాధించాలని వాసవి క్లబ్ అధ్యక్షుడు పాపారావు, కార్యదర్శి కొండలు కోరారు. రోశయ్య 4వ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి సత్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఉప్పల రామ్‌నరేష్, పొలిశెట్టి నర్సింహారావు, ఓరుగంటి నర్సింహారావు, గణేష్,పాల్గొన్నారు.

● నేరేడుచర్ల: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య వర్ధంతిని గురువారం నేరేడుచర్లలోని మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి మునిసిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దామోదర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులు

నాగారం, ఆకో 4(ఆంధ్రజ్యోతి): మాజి మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కి మండలంలోని గ్రామాల్లో కాంగ్రెసు నాయకులు నివాళులర్పించారు, శనివారం తుంగతుర్తి లో దామోదర్‌రెడ్డి అంత్యక్రియలకు కాంగ్రెసు కార్యకర్తలు భారిగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో తోడుసు లింగయ్య, బుచ్చిబాబు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

'రెగ్యులర్ అధికారిని నియమించాలి'

హుజూర్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్మిక శాఖలో రెగ్యులర్ అధికారిని నియమించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎలక సోమయ్య కోరారు. గురువారం పట్టణంలోని సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జిల్లా కార్మిక శాఖలో రెగ్యులర్ అధికారి లేనందున వేలాది మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మిక సంక్షేమ శాఖ పోస్టులలో ఇన్‌చార్జులు కార్మికులకు అందుబాటులో ఉండడం లేదన్నారు. కార్మిక శాఖను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. సమావేశంలో నరేష్, నాగేంద్రబాబు, నెహ్రూ, శ్రీను, బాబు, సారయ్య, సైదమ్మ, కోటయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బెల్ట్ దుకాణాల యజమానుల బైండోవర్

పెన్‌పహాడ్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 29 గ్రామ పంచాయతీలు, అవాస గ్రామాలలో మద్యం బెల్ట్ దుకాణాల యజమానులను తహసీల్దార్ ధరవాత్ లాల్‌నాయక్ ఎదుట ఎస్‌ఐ గోపికృష్ణ గురువారం బైండోవర్ చేయించారు. బైండోవర్‌ను అతిక్రమించి మద్యం విక్రయిస్తే కేసులతో పాటు రూ2లక్షలు జరిమాన విధిస్తారని ఎస్‌ఐ తెలిపారు. అందరూ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీ రవీందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు వాయిదా

సూర్యాపేట టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా వరంగల్‌లో ఈ నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు వాయిదా వేశారని, ఈ మహాసభలను జనవరి 5, 6, 7తేదీలకు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, మహేష్, వినయ్, నవీన్, పవన్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

మద్దిరాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు గుర్తులు కేటాయించడంతో గురువారం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు, వారి అనుచరులు పాల్గొన్నారు.

చేపా..చేపా ఎదిగేవా?

(5వ పేజీ తరువాయి)

పంపిణీ చేయకముందు మత్స్యకారులు తమకు అనుకూలమైన ప్రాంతాలలో చేపపిల్లలను కొనుగోలు చేసుకొని వారే చెరువులలో వదిలేవారు. అవి పెరిగిన తరువాత విక్రయించుకునేవారు. పెద్దపెద్ద ప్రాజెక్టుల్లో అయితే ప్రైవేటు కాంట్రాక్టర్లు చేపపిల్లలను కొనుగోలు చేసి పెంచేవారు. అవి పెరిగిన తరువాత ప్రాజెక్టు పరిధిలో ఉండే మత్స్యకారులతో చేపలను పట్టించి బయట మార్కెట్లో విక్రయించేవారు. చేపలను పట్టించిన మత్స్యకారులకు కిలోకు కొంత డబ్బును ఇచ్చేవారు. ఇదంతా గతంలో జరగగా ప్రస్తుతం ప్రభుత్వం చేపపిల్లలను ఇస్తుండగా అవికాస్త ఆలస్యంగా పంపిణీ చేస్తుండడంతో ఎదుగుదల లేక ఇబ్బంది తప్పడం లేదని మత్స్యకార్మికులు వాపోతున్నారు. ప్రభుత్వం సకాలంలో పంపిణీ చేయడంతో పాటు నాణ్యమైన చేపపిల్లలను ఇవ్వాలని కోరుతున్నారు.

నాణ్యతగల చేపపిల్లలను పంపిణీ చేశాం

జిల్లాలో నాణ్యమైన చేపపిల్లలను పంపిణీ చేశాం. చేపపిల్లలు అన్నిచోట్ల ఒకే రకంగా ఎదగవు. అక్కడి చెరువులో వాతావరణం, కాలుష్యాన్ని బట్టి చేపపిల్లలు ఎదుగుతాయి. ఒక చెరువులో బాగా ఎదిగితే మరో చెరువులో తక్కువ సైజ్ ఉండడానికి అనేక కారణాలు ఉంటాయి. మత్స్యకారులు చేపలకు సరైన దాణా ఇవ్వాల్సి ఉంటుంది. కొంతమంది సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో చేపపిల్లలు ఎదగవు. ఈసారి మెజార్టీ చెరువుల్లో కిలోకు పైగా చేపపిల్లలు ఉండే అవకాశం ఉంది.

● నాగులునాయక్, మత్స్యశాఖ జిల్లా అధికారి

సాంకేతిక విజ్ఞానాన్ని పెంచుకోవాలి



సాంకేతిక ప్రదర్శనలో విద్యార్థినులు

నేరేడుచర్ల, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు సాంకేతిత విజ్ఞానాన్ని పెంచుకోవాలని పట్టణంలోని శ్రీవాణి ఇంగ్లిషు మీడియం స్కూల్ కరస్పాండెంట్ కొణతం సీతారాంరెడ్డి అన్నారు. ఉలిప్స్ అంతర్జాతీయ సంస్థ సహకారంతో విద్యార్థులకు పైతాన్ కోడింగ్, డేటా ఎనాలసిస్, మిషన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటి కార్యక్రమాలను పాఠశాలలో ప్రారంభించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం నిర్వహించిన స్కిల్ దర్బార్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉలిప్స్ కంపెనీ బిజినెస్ మేనేజర్ యుగందర్, రీజినల్ డైరెక్టర్ సుప్రియ, మధులత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను ప్రతిఒక్కరూ నిషేధించాలి

చిలుకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను ప్రతిఒక్కరూ నిషేధించాలని పర్యావరణ ఉద్యమవేత్త, రచయిత కొల్లు లక్ష్మీనారాయణరావు అన్నారు. గురువారం చిలుకూరు మండలంలోని ఆర్లెగూడెం గ్రామంలోని అయ్యప్ప మాలధారులకు కన్నెకంటి నాగరాజు 50 స్టీల్ ప్లేట్స్‌ను సమకూర్చగా, వాటిని లక్ష్మీనారాయణ అందజేసి మాట్లాడారు. ప్లాసిక్ విస్తర్లతో తినడం, ప్లాస్టిక్ గ్లాసులతో తాగడం ఆరోగ్యానికి హానికరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సాగర్ల నాగేశ్వరరావు, గంటం వాసు, కొట్టం శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతాభివృద్ధికి కృషి



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

హుజూర్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉన్నతాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పట్టణంలోని వాగ్దేవి పాఠశాల కరస్పాండెంట్ జ్యోతిబాబు అన్నారు. గురువారం ఆ పాఠశాల స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారుల పాత్రలను విద్యార్థులు పోషించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మాట్లాడారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, మౌనిక, సుష్మ, కల్యాణి, మనీషా, ఉమ, సునీత, జ్యోతి, విజయశ్రీ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంఈవో సైదానాయక్

హుజూర్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈవో సైదానాయక్ అన్నారు. గత ఏడాది 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చెక్కులు అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఏడాది 10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సైదులు, జనార్దన్‌రెడ్డి, శైలజ, జయప్రద, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.